7

సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025ద

కాలినడక కాలచక్రం

ఒకప్పుడు ఎంతదూరమైనా బడికి కాలినడకనో సైకిళ్లపైనో వెళ్లొచ్చేవారు. ఇప్పుడు ఆటో రిక్షాలు, బస్సులు, సొంత వాహనాల్లో వెళ్తున్నారు. పుస్తకాలను ఒకప్పుడు వస్త్రాలతో లేదా గోనెసంచిలతో కుట్టిన బ్యాగుల్లోనో, సిల్వర్ బాక్స్‌ల్లోనో బడికి తీసుకెళ్లేవారు. కానీ, ఇప్పుడు అనేక ఆకర్షణీయమైన స్కూల్ బ్యాగుల్లో తీసుకెళ్తున్నారు. గ్రౌండ్‌లో ఆటల దగ్గర్నుంచి మొబైల్‌లోనే ఆటలాడుకునే దశకు వచ్చింది పరిస్థితి. విద్యార్థులు బడికి వెళ్లేక్రమంలో కాలక్రమేణా వచ్చిన మార్పులపై 'సాక్షి'ప్రత్యేక కథనం. 8లో



దుబ్బాకరూరల్:

న్యూస్‌రీల్

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మొక్కలు నాటుతున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 17న ప్రతీ ఒక్కరు మొక్క నాటాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో శనివారం ఆయన మొక్క నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...హరితహారం పేరుతో తెలంగాణను ఆకుపచ్చగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, నాగరాజ్ గౌడ్, విఠల్,నర్సింలు, గోవర్ధన్ రెడ్డి, పాల్గొన్నారు.

కదం తొక్కిన మహిళలు

11వ రోజుకు చేరిన 'ప్యారానగర్'నిరసన దీక్షలు



మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు 11వ రోజుకు చేరాయి. మహిళలు శనివారం పెద్ద సంఖ్యలో పాల్గొని ఆందోళన చేపట్టారు. ఆటోర్యాలీ, ఎడ్లబండ్ల ర్యాలీలతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు డంపింగ్ యార్డు నిర్మాణ పనులు అడ్డుకునేందుకు యతి్నంచగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. డంపింగ్‌యార్డు ఏర్పాటును ప్రభుత్వం విరమించేదాక తమ పోరాటం ఆపేదిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, మహిళలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆ స్థాయి రేవంత్‌కు లేదు

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రధాని నరేంద్ర మోదీ అగ్ర కులస్తుడంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మండిపడ్డారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ బీసీగా కన్వెర్ట్ అయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల ఐక్యత వల్లనే దేశంలో వివిధ రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, బీసీల గురించి మాట్లాడే నైతికహక్కు రేవంత్‌కు లేదన్నారు. బీసీల కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని, బీసీ హాస్టళ్లలో వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన రిజర్వేషన్ల హామీని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ భాను ప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా కార్యదర్శి నాగరాజ్, ఓబీసీ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రజాభిప్రాయానికి వ్యతిరేకమైన ప్యారానగర్ డంపింగ్‌యార్డ్‌ను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం జరిగిన సీపీఎం నాయకుల జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పర్యావరణానికి నష్టం కలిగే విధంగా ప్యారానగర్ డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టడం సరైంది కాదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, రాజయ్య, రాంచందర్, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక 'సహకారం' లేదు

డబ్బుల్లేక కొట్టుమిట్టాడుతున్న సహకార సంఘాలు

- సిబ్బందికి జీతాలివ్వలేని దుస్థితి
- సీ, డీ గ్రేడ్‌లకు దిగజారిన 26 పీఏసీఎస్‌లు
- 2024 ఆడిట్ నివేదికలో వెలుగులోకి ఆర్థిక పరిస్థితి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అన్నదాతలకు అండగా నిలవాల్సిన సహకార సంఘాలు (పీఏసీఎస్) ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీసం ఆయా సంఘాల్లో పనిచేస్తున్న ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని స్థాయికి పీఏసీఎస్‌లు దిగజారిపోయాయి. జిల్లాలో సుమారు సగానికి పైగా సహకార సంఘాలది ఇదే పరిస్థితి. జిల్లావ్యాప్తంగా మొత్తం 53 సహకార సంఘాలున్నాయి. ఈ సహకార సంఘాల ఆర్థిక లావాదేవీలపై ఏటా సహకార శాఖ ఆడిట్ ప్రక్రియను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా 2023–24 ఆర్థిక ఏడాదికి సంబంధించి ఈ 53 సంఘాల ఆడిట్ ప్రక్రియ గత నెలలో పూర్తయింది. అయితే 53 సహకార సంఘాల్లో ఏకంగా 25 సంఘాలు సీ గ్రేడ్‌లో కొనసాగుతున్నాయి. ఈ సంఘాలు కొన్నేళ్లుగా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. పటాన్‌చెరు మండలం భానూరు సహకార సంఘం ఆర్థిక పరిస్థితి ఏకంగా సీ గ్రేడ్ నుంచి డీ గ్రేడ్‌కు పడిపోవడం గమనార్హం. గతేడాది డీ గ్రేడ్‌లో కొనసాగిన కోహీర్ మండలం బిలాల్‌పూర్ సహకార సంఘం మాత్రం ఒక మెట్టు ఎక్కి సీ గ్రేడ్‌కు చేరింది. ఇలా సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నట్లు. ఇక ఏ గ్రేడ్‌లో ఆరు సంఘాలుండగా, బీ గ్రేడ్‌లో 21 సహకార సంఘాలు కొనసాగుతున్నట్లు తేలింది.

ఆర్థిక లావాదేవీల ఆధారంగా గ్రేడింగ్..

ఆయా సహకార సంఘాల ఆర్థిక పరిస్థితులను బట్టి ప్రభుత్వం గ్రేడింగ్ ఇస్తుంది. ఆ సంఘం ఆ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, రైతులకు పంట రుణాల మంజూరు, ఆ రుణాల రికవరీ, ఎరువులు, విత్తనాలు వంటి వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల అమ్మకం, ధాన్యంసేకరణ వంటి కార్యకలాపాలతో ఆయా సంఘాలకు కొంత ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన ఆదాయంతో సిబ్బంది జీతభత్యాలు, సంఘం అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. కానీ, ఈ కార్యకలాపాలేవీ లేకపోవడంతో ఈ సంఘాలు ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కలేకపోతున్నాయి.

ధాన్యం సేకరణ ఉన్న సంఘాలు కొంత మెరుగు..

ఏటా ఖరీఫ్, రబీ కొనుగోలు సీజన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన సహకార సంఘాలు కొంత మేరకు ఆర్థికంగా బలపడతాయి. ఈ కొనుగోళ్లకు సంబంధించి కమీషన్ రూ.లక్షల్లో వస్తుంది. ఇలా ధాన్యం సేకరణ వంటి కార్యకలాపాలకు కొనసాగిన సంఘాల ఆర్థిక పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. దీంతో ఆయా సంఘాల్లోని ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభంలో ఉన్న సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నాలుగైదు నెలలకు ఒకసారి కూడా వేతనాలు అందడం లేదు. అలాగే ఆయా సంఘాల్లోని పాలకవర్గం పీఏసీఎస్ అభివృద్ధి కోసం కొంత చొరవ చూపి వ్యాపార లావాదేవీలు నిర్వహించిన సంఘాలు కూడా ఆర్థిక ఇక్కట్ల నుంచి కొంత గట్టెక్కాయి. కానీ, పాలకవర్గం నిర్లక్ష్యానికి తోడు కార్యకలాపాలు లేని సంఘాలు ఇంకా ఆర్థిక సంక్షోభంలోనే కొనసాగుతున్నాయి.

ఏ–గ్రేడ్‌లో ఉన్న సంఘాలివే..

జిల్లాలో ఏ గ్రేడ్‌లో ఉన్న సంఘాలను పరిశీలిస్తే.. ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ (సంగారెడ్డి మండలం), కసాల (హత్నూర), బొక్కస్‌గాం (నారాయణఖేడ్), మాచిరెడ్డిపల్లి (కోహీర్), తెల్లాపూర్ (రామచంద్రాపురం), ఝరాసంఘం సహకార సంఘాలు లాభాల్లో కొనసాగుతున్నట్లు సహకారశాఖ నిర్వహించిన ఆడిట్‌లో తేలింది.

ఆర్నెల్లు పొడిగింపు

పీఏసీఎస్‌ల పదవీకాలం పెంపుపై ప్రభుత్వం ఉత్తర్వులు

పునర్వ్యవస్థీకరణ అనంతరం ఎన్నికలు



బాచేపల్లిలోని పీఏసీఎస్ భవనం

నారాయణఖేడ్: జిల్లా సహకార సంఘాల పాలకవర్గాల (పీఏసీఎస్ -ప్యాక్స్) పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరునెలలపాటు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వం శనివారం జీవో నం 74 జారీ చేసింది. దీంతో జిల్లాలో డీసీసీబీ పరిధిలోని 37, స్టేట్ బ్యాంకు పరిధిలోని 16 పీఏసీఎస్‌లు కలిపి మొత్తం 53 ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం పెంచినట్టైంది. ఇటీవల పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాలు రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి ద్వారా పదవీకాలం పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై ప్రభుత్వానికి వచ్చిన నివేదిక మేరకు మరో ఆరునెలలపాటు వీరి పదవీకాలం పెంచుతూ ఉత్తర్వులు వెలువరించింది. సహకార సంఘాలు వ్యవసాయ ఉత్పత్తులు, సరఫరా, మార్కెటింగ్ వ్యాపాలు వేగంగా జరుగుతున్న తరుణంలో పీఏసీఎస్‌ల పునర్వ్యవస్థీకరణ అవసరం అని సహకార సంఘాల డైరెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. సేవా ప్రాంతం, వ్యాపార టర్నోవర్, వ్యాపార సామర్థ్యం, ఆర్థిక సాధ్యత, సేవల డెలివరి తదితర అంశాలపై రాష్ట్రంలోని పీఏసీఎస్‌ల పునర్వ్యవస్థీకరణ కోసం ప్రతిపాదనలు పంపించాలని డీసీసీబీలు, డీసీవోలు, సీఈవోలకు సహకార సంఘాల రిజిస్ట్రార్ నివేదించారు. పీఏసీఎస్‌ల పునర్నిర్మాణంకు సమగ్ర పథకాన్ని తయారు చేశాక పీఏసీఎస్‌లు, డీసీసీబీలు టీజీసీఏబీలకు ఎన్నికలు నిర్వహించాలని సహకార సంఘాల రిజిస్ట్రార్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. పై అంశాలను పరిశీలించిన పాలకవర్గాల పదవీకాలాన్ని ఆరునెలలపాటు పొడిగించింది.

పీఏసీఎస్‌ల పునర్వ్యవస్థీకరణ

పీఏసీఎస్‌లను పెంచి వాటిని బలోపేతం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఒక్కో పీఏసీఎస్‌ల పరిధిలో గ్రామాల సంఖ్య అధికంగా ఉండటం, రెండు మండలాలు కలిపి ఒక పీఏసీఎస్‌లు ఉండటం, మండలాలు, జిల్లాలు పునర్వ్యవస్థీకరణ అయిన దృష్ట్యా పీఏసీఎస్‌లను ప్రభుత్వం విస్తరించనుంది. జిల్లాలో మరో 8 నూతన పీఏసీఎస్‌లు నాగల్‌గిద్ద, తడ్కల్, నిజాంపేట్, హత్నూర, జహీరాబాద్, వడ్డేపల్లి, మునిపల్లి, ఆత్మకూర్, వట్‌పల్లిల్లో ఏర్పాటుకు ప్రతిపాదించారు. 2020 ఫిబ్రవరి రెండో వారంలో సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించారు. సాధారణంగా పాలక వర్గాల పదవీకాలం ఆరునెలల సమయం ఉండగానే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. కానీ, పీఏసీఎస్‌లను బలోపేతం చేయడం, అవసరం మేర కొత్తవి ఏర్పాటు చేసి ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం యోచిస్తుంది. ఈ దృష్ట్యా వీరి పదవీకాలం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి జోన్: ప్రభుత్వం కేటాయించిన నిధులను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుని, మౌలిక వసతులు మెరుగుపరచుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మండల విద్యాశాఖ అధికారులతో ఎంపిక చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల అభివృద్ధి పనులపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 44 పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. మంజూరైన నిధులతో ఆ పాఠశాలల్లో క్రీడలు,నైపుణ్యాభి వృద్ధి, తరగతి గదుల నిర్మాణం, కిచెన్ గార్డెన్, ఫీల్డ్ విజిట్, ఎల్ఈడీ లైటింగ్, లైబ్రరీ అభివృద్ధి, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ల్యాబ్ ఏర్పాట్లు వంటి తదితర అభివృద్ధి పనులకు వినియోగించాలని అధికారులకు సూచించారు. ఈ అభివృద్ధి పనులను నిర్దేశిత కాలవ్యవధిలో నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఈఈపీ ఆర్ జగదీశ్, ఎంఈవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని బంజారాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ బోధనలు నేటి తరానికి అనుసరణీయమని ఆయన తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ...సొంత నిధులతో నియోజకవర్గ పరిధిలోని రాళ్ల కత్వ, ఐలాపూర్, వెలిమెల, కొల్లూరు తాండలలో సేవాలాల్ మహారాజ్ దేవాలయాలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో అమీనపూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మండల విద్యాధికారులు పి.పి.రాథోడ్, నాగేశ్వర్ నాయక్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు



ఎమ్మెల్యే నివాసం ఆవరణలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

నారాయణఖేడ్: సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను నారాయణఖేడ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి స్వగృహం ఆవరణలో కాంగ్రెస్, జీఎంఆర్ ఫౌండేషన్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి ఈ వేడుకల్లో సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రామ మహారాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం రాజీవ్ చౌక్‌వరకు శోభాయాత్ర నిర్వహిచి సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. జర్నలిస్టు కాలనీలోని భవానీ మాత ఆలయంలో భోగ్‌బండార్, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. దేవిదాస్ మహారాజ్, జీఎంఆర్ ఫౌండేషన్ బాధ్యులు గుర్రపు మశ్చందర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

సంగారెడ్డి జోన్: పోలీసు అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. జిల్లా పరేడ్‌గ్రౌండ్‌లో శనివారం 'వార్షిక పునరుశ్చరణ మొబిలైజేషన్'శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. పరేడ్‌కు హాజరై పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 305 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు, సిబ్బందికి 15 రోజుల పాటు ప్రాథమిక శిక్షణను గుర్తు చేస్తూ, ప్రతీ రోజు ఉదయం ఫిజికల్ ట్రైనింగ్, పరేడ్, మాబ్ ఆపరేషన్, లాఠీ డ్రిల్, ఆయుధాలపై శిక్షణ, నాకాబందీలో పాటించాల్సిన మెలుకువలు, మారుతున్న సమాజానికి అనుగుణంగా విధి నిర్వహణలో ఏవిధంగా నడుచుకోవాలని, వృత్తిరీత్యా నైపుణ్యతపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

హత్య చేసి.. దహనం చేశా..!

పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు	దొరకని మృతదేహం ఆనవాళ్లు	నిందితుడిని సంగారెడ్డి పోలీసులకు అప్పగింత





జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న దశరథ్ కుటుంబీకులు, పక్కన దశరథ్

నారాయణఖేడ్: ''నేను దశరథ్‌ను హత్య చేసి.. దహనం చేశా.. అందుకే మీ ముందు లొంగిపోతున్న'అని ఓ వ్యక్తి పోలీసులకు చెప్పడం కలకలం సృష్టించింది. నిందితుడు నిర్భయంగా, నేరుగా వచ్చి తానే హత్య చేశానంటూ ఒప్పుకోవడంతో పోలీసులు కంగుతిన్నారు. ఈ సంఘటన నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపేట్ మండలం నాగ్‌ధర్ రాంచందర్ తండాకు చెందిన దశరథ్ (30) సంగారెడ్డిలోని గణేష్ ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటికి వెళుతున్నానని చెప్పి తన యజమాని బైక్ తీసుకొని బయలుదేరి అదృశ్య మయ్యాడు. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ దశరథ్ భార్య సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉండగా.. దశరథ్‌ను తానే హత్య చేసి కాల్చి వేశానంటూ నారాయణఖేడ్ మండలం మేఘ్యానాయక్ తండాకు చెందిన గోపాల్.. ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. అతను చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు తండాల శివారులు, అటవీ ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. నిందితుడు గోపాల్‌ను సంగారెడ్డి రూరల్ పోలీసులకు అప్పగించినట్లు ఖేడ్ ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

రోడ్డుపై బైఠాయింపు

విషయం తెలుసుకున్న దశరథ్ కుటుంబీకులు, బంధువులు నిజాంపేట్– ఖేడ్ 161బీ జాతీయ రహదారిపై బైఠాయించారు. మృతదేహాన్ని అప్పగించాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. కాగా, వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే.. గోపాల్ చెప్పినట్లు మృతదేహం ఆనవాళ్లు లభించకపోవడం.. అసలు దశరథ్ హత్యకు గురయ్యాడా లేదా అనేది పోలీసులు నిర్ధారణకు రాలేకపోతున్నారు. మిస్సింగ్ కేసు ఇంకా మిస్టరీగానే ఉంది. ఈ కేసుపై విచారణ జరుపుతున్నామని, త్వరలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు చెబుతున్నారు.

ఎమ్మెల్సీ బరి.. పార్టీల గురి

- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బీజేపీ
- ప్రచారం జోరు పెంచిన అభ్యర్థులు
- పట్టభద్రుల ఎమ్మెల్సీకి 56, ఉపాధ్యాయకు 15 మంది పోటీ



పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను బీజేపీ, కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈనెల 27వ తేదీన పోలింగ్ జరగనుండటం.. ప్రచారానికి మరో 10 రోజులే గడువు ఉండడంతో అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి 56 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 15 మంది పోటీ చేస్తున్నారు.

సాక్షి, సిద్దిపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ నుంచి డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నుంచి నరేందర్‌రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ నుంచి ప్రసన్న హరికృష్ణ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా యాదగిరి శేఖర్‌రావు, దేవునూరి రవీందర్‌తో పాటు మరో 51 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ నుంచి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ప్రైవేట్ స్కూల్ టీచర్స్ మద్దతుతో జగ్గు మల్లారెడ్డితో పాటు 11 మంది బరిలో నిలిచారు. శనివారం హుస్నాబాద్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు. సిద్దిపేటలో బీజేపీ నాయకులతో ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ సమావేశం నిర్వహించి ప్రచారం తీరును అడిగి తెలుసుకున్నారు.

25 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి

బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్ర నాయకత్వం జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను ప్రకటించింది. టీచర్స్ ఎమ్మెల్సీకి రంగారెడ్డి అర్బన్ అధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన నాయకుడు బాణాల లక్ష్మారెడ్డిని నియమించింది. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నాయకులకు బాధ్యతలు అప్పగించింది. స్థానిక నాయకులకు 25 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించారు. ప్రతి ఓటరును నాలుగుసార్లు కలిసి పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చే బాధ్యత వీరిదే. కాంగ్రెస్ పార్టీ ప్రతి 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని, నియోజకవర్గ వారీగా ఇన్‌చార్జిలను నియమించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగ మహేందర్‌రెడ్డి సైతం పీఆర్‌టీయూ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. గత ఆరు నెలల నుంచే వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు పలు సంఘాలు మద్దతు ప్రకటించి ప్రచారంలో పాల్గొంటున్నాయి. ఎక్కువ ఓట్లు ఉన్న ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు.

ఉదయం, సాయంత్రం ప్రచారం

పాఠశాలలో తరగతులు కొనసాగుతున్న సమయాల్లో అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించొద్దని ఎన్నికల సంఘం నిబంధన పెట్టింది. దీంతో అభ్యర్థులు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉపాధ్యాయ ఓటర్లను కలిసి తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతున్నారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు సమ్మేళనాలు నిర్వహిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. మేనిఫెస్టోలు సైతం ప్రకటిస్తున్నారు. సాయంత్రం గెట్ టు గెదర్ నిర్వహించి దావత్‌లతో మచ్చిక చేసుకుంటున్నారు.

క్లుప్తంగా

79 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

సిద్దిపేట సీపీ అనురాధ



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న సీఐ వాసుదేవరావు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించి డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. పట్టుబడిన వాహనదారులపై 79 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తరచుగా ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించి, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలినడక.. కాలచక్రం

- నాడు నడుచుకుంటూ, సైకిల్, రిక్షాలపై బడికి..
- నేడు ఆటోలు, బస్సులు, కార్లు, బైక్‌లపై..
- యూనిఫామ్స్ లేకుండా స్కూల్‌కి..
- బట్టతో కుట్టినవి, బియ్యం బస్తాలతో బ్యాగులు
- ప్రస్తుతం మార్కెట్‌లో వెరైటీగా..
- పూర్తిగా మారిన విద్యార్థుల స్కూల్ దశ



ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

సండే స్పెషల్

మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకూ పెరిగిపోతుంది. ఫలితంగా ఇటు విద్యలోనూ అటు విద్యార్థుల్లోనూ అనేక మార్పులు వచ్చాయి. గతంలో ఐదారు గ్రామాలకు కలిపి ఒకే పాఠశాల ఉండగా.. కిలో మీటర్ల మేర కాలినడకన వెళ్లేవారు. బస్సులు, ఆటోలు, బైక్‌లు ఉండేవి కాదు. సైకిల్ ఉంటే తల్లిదండ్రులు తమ పిల్లలను కూర్చోబెట్టుకొని పాఠశాలలో దింపేవారు. లేదా రిక్షాలో వెళ్లే వారు. కానీ, నేడు అంతా మారింది. కార్లు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, సొంత బైక్‌లపై వెళ్తున్నారు. విద్యార్థుల పాఠశాల దశలో అప్పటికీ, ఇప్పటికీ మారిన తీరుతెన్నులపై సాక్షి ప్రత్యేక కథనం.

\- చెక్కపల్లి రాజమల్లు

దుబ్బాకరూరల్



యూనిఫామ్‌లు ఉండేవి కాదు: నాడు పాఠశాలకు వెళ్లాలంటే సివిల్ డ్రెస్సుల్లోనే వెళ్లేవారు. అక్కడక్కడ చిరిగి పోయిన డ్రెస్సులు వేసుకునే వారు. విద్యార్థుల హెయిర్ స్టైల్ పొడవాటి జుట్టు ఉండేది. ఎలాంటి మార్పు ఉండేది కాదు. చెప్పులు వేసుకుని పాఠశాలకు వెళ్లేవారు. నేడు విద్యార్థుల్లో పూర్తిగా మార్పు వచ్చింది. రకరకాల డ్రెస్సులు, హెయిర్ స్టైల్స్ చేసుకుంటున్నారు. డ్రెస్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థులు పాఠశాలకు యూనిఫామ్, షూస్ ధరించి వెళ్తున్నారు.

బట్ట బ్యాగ్‌లు, గోనె సంచి బ్యాగ్‌లు : విద్యార్థులు తమ పుస్తకాలను బ్యాగ్‌లో పెట్టుకొని వెళ్లాలంటే బట్టతో కుట్టిన బ్యాగ్‌లు, గోనె సంచితో కుట్టిన బ్యాగ్‌లను వాడేవారు. నేడు రక రకాల బ్యాగులు మార్కెట్లోకి వచ్చాయి. జిప్పులు, బొమ్మలు ఉన్న బ్యాగులు కొంటున్నారు. పుస్తకాల బరువు తగ్గట్లు పెద్ద బ్యాగులు కొంటున్నారు.

వాహనాలపై పాఠశాలకు : నేడు విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాలు ఉన్నాయి. పాఠశాలకు వెళ్లాలంటే బస్సులు, ఆటోలు, బైక్‌లు సౌకర్యంగా ఉన్నాయి. నర్సరీ దశ నుంచి విద్యార్థులు వాహనాలపై పాఠశాలకు వెళ్తున్నారు. ప్రస్తుతానికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేవు.

ల్యాండ్ ఫోన్లు, పోస్టుకార్డులు : నాడు విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తే ల్యాండ్ ఫోన్ల ద్వారా కుటుంబీకులతో మాట్లాడేవారు. లేకుంటే పోస్టుకార్డు ద్వారా తమ ఇంటికి సమాచారం తెలిపే వారు. నేడు విద్యార్థులు సెల్ ఫోన్లలో మాట్లాడుతున్నారు.

మాజీ సీఎం కేసీఆర్ కాలినడకన బడికి : మాజీ సీఎం కేసీఆర్‌ది సిద్దిపేట జిల్లా, చింతమడక స్వగ్రామం. చింతమడక దుబ్బాకకు ఎనిమిది కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. అంత దూరం నుంచి సైకిల్‌పై పాఠశాలకు వచ్చేవారు. ఆయన తీపి గుర్తుగా దుబ్బాకలో పెద్ద పాఠశాల భవనాన్ని కట్టించారు. దానికి కేసీఆర్ స్కూల్‌గా నామకరణం చేశారు.



రిక్షాలో బడికి వెళ్తున్న విద్యార్థులు



వ్యాన్‌లో బడికి వెళ్తూ..

ఒక్క రూపాయికే సైకిల్ కిరాయి: ఆ రోజుల్లో ఇంటర్ విద్యార్థులకు బస్సు సౌకర్యం ఉండేది కాదు. గంటకు ఒక్క రూపాయి ఇచ్చి సైకిల్ కిరాయి తీసుకొని కాలేజీకి వెళ్లే వారు. నేడు విద్యార్థులు కాలేజీకి వెళ్లాలంటే బైక్‌లపైనా, కార్లలో వెళ్తున్నారు.

ఇంటి వద్ద ఆటలు : గతంలో విద్యార్థులు పాఠశాల నుంచి రాగానే ఇంటి వద్ద క్రికెట్, చిర్రగోనె, గోలీల ఆట, బొంగురం, ఆట, కబడ్డీ, వ్యవసాయ పొలాల వద్ద నీటి కుండిలో ఆటలు ఆడేవారు. నేడు సెల్ ఫోన్లు రావడంతో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారు.

క్రమం తప్పకుండా బడికి



మా కాలంలో గురువులను తల్లిదండ్రులను గౌరవించే వాళ్లం. వాళ్లకు ఎదురు తిరిగే వాళ్లం కాదు. బడికి క్రమం తప్పకుండా వెళ్లాం. గురువులంటే చాలా భయంగా ఉండేది. తరగతి గదిలో గురువు చెప్పిన పాఠాలు విని మరుసటి రోజున చెప్పే వాళ్లం. అప్పుడు చేతిలో చిల్లి గవ్వ ఉండేది కాదు. సెలవు రోజుల్లో కూలి పనికి వెళ్లే వాళ్లం.

\- కట్కూరి రాంచంద్రం, పూర్వ విద్యార్థి

ల్యాండ్ ఫోన్‌లో మాట్లాడేది



నేను హైదరాబాద్‌లో వెటర్నరీ కోర్సు చేసేటప్పుడు మా తల్లి దండ్రులతో మాట్లాడాలంటే ఎక్కడైనా ల్యాండ్ ఫోన్ ఉంటే మాట్లాడే వాడిని. ఫోన్ అందుబాటులో లేకపోతే పోస్టుకార్డు ద్వారా మా తల్లిదండ్రులకు లేఖ రాసే వాడిని.

\- భద్రయ్య, పూర్వ విద్యార్థి

సైకిల్‌పై బడికి వచ్చే వాడిని



మాది చెల్లాపూర్ గ్రామం నేను దుబ్బాకలో చదువుకునేటప్పుడు బడికి కాలినడకన మా స్నేహితులతో కలిసొచ్చే వాళ్లం. అప్పుడప్పుడూ మా నాన్న సైకిల్‌పై బడిలో దింపేవాడు. నేను ఇంటర్ చేసేటప్పుడు గంటకు ఒక్క రూపాయి కిరాయితో సైకిల్‌పై వచ్చే వాడిని.

\- పరుశరాములు, పూర్వ విద్యార్థి, చెల్లాపూర్ గ్రామం



సైకిల్, రిక్షాలపై పాఠశాలకు :
నాడు విద్యార్థులకు బస్సులు, ఆటోలు, బైక్‌లు లేకపోవడంతో కాలి నడకనే పాఠశాలకు వెళ్లేవారు. గ్రామం నుంచి పాఠశాలకు ఐదారు కిలో మీటర్ల దూరంలో ఉండేది. కొంత మంది విద్యార్థులు కాలినడకన వెళ్లేవారు. సైకిల్ ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో దింపే వారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కిరాయి రిక్షాలో పంపేవారు. మరికొందరు ఆట్లో వెళ్లేవారు.



బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



సతీశ్ మృతదేహం

సదాశివపేట(సంగారెడ్డి): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో చోటు చేసుకుంది. సిద్దాపూర్ కాలనీకి చెందిన మంగళి సతీశ్(24) కూలి పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొట్టిన కారు

\- నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో సచిన్

నారాయణఖేడ్: ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. క్షతగాత్రుల కథనం మేరకు.. నిజాంపేట వైపు నుంచి ఖేడ్ వైపు వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ఆటలో ప్రయాణిస్తున్న జూకల్ శివారులోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న మనూరు మండలం రాణాపూర్‌కు చెందిన వంశీ, చాప్టా(కె)కు చెందిన సచిన్‌తోపాటు ఖేడ్ పట్టణానికి చెందిన జ్యోతి, ర్యాలమడుగుకు చెందిన ఆటో డ్రైవర్ నారాయణకు గాయాలు అయ్యాయి. అటుగా వస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్ క్షతగాత్రులను ఆటోల్లో ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. గురుకులం ప్రిన్సిపాల్ లింగారెడ్డి ఆస్పత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఎదురుగా వస్తున్న కారును ఆటో ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన మండలంలోని కంభాలపల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. మునిపల్లి మండలంలోని మేల సంఘం గ్రామానికి చెందిన ఏర్పుల నాగరాజ్(28) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఇతను వికారాబాద్ జిల్లా మోమిన్ పేట గ్రామంలో మేకల అంగడీకి వెళ్లాడు. మేకలను కొనుగోలు చేసి గ్రామానికి ఆటోలో తమ్ముడు మల్లేశ్‌తో కలిసి వస్తుండగా కంబాలపల్లి శివారులో ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తమ్ముడికి తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వాత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బొలెరో వాహనం బోల్తా

\- గొర్రెల వ్యాపారి మృతి – నలుగురికి స్వల్ప గాయాలు



ఐలయ్య మృతదేహం

దుబ్బాకరూరల్: బొలెరో వాహనం బోల్తా పడి గొర్రెల వ్యాపారి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని హబ్సిపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ గ్రామానికి చెందిన వజ్జ ఐలయ్య(74) గొర్రెల వ్యాపారం చేస్తాడు. శనివారం తెల్లవారుజామున నిజామాబాద్ జిల్లా నవీపేటలో జరిగే గొర్రెల, మేకల సంతకు భయ్య లక్ష్మణ్‌కు చెందిన బొలెరో వాహనంలో లింగన్న, ఈరన్న, రమేశ్‌తో కలిసి బయల్దేరాడు. హబ్సిపూర్ గ్రామ శివారులోకి రాగానే వాహనం బోల్తా పడింది. ఐలయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి పోలీస్‌లు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

చిన్నశంకరంపేట(మెదక్): కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటన నార్సింగి మండలం సంకాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ కథనం మేరకు.. శుక్రవారం రాత్రి మేడ్చల్ జిల్లా అల్వాల్‌కు చెందిన డబిల్‌పురం నిహాల్ బంధువులతో కలిసి కారులో కాశీ నుంచి జాతీయ రహదారిపై వస్తున్నాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతోపాటు కారును కొద్ది దూరం లాక్కుపోయింది. ఈ ఘటనలో కారు దిబ్బతినగా ఆరుగురు ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. దీంతో లారీ డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

సిద్దిపేటకమాన్: పార్క్ చేసిన బైక్ దొంగతనానికి గురైన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం హనుమాన్ నగర్‌కు చెందిన పొర్ల చరణ్ స్థానికంగా వ్యాపారం చేస్తుంటాడు. వ్యక్తిగత పని నిమిత్తం బయటకు వెళ్లిన చరణ్ పట్టణంలోని ఎస్ఎల్ కాంప్లెక్స్ వద్ద 6న బైక్ పార్క్ చేసి వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా దొరకలేదు. శనివారం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దంతన్‌పల్లిలో..

శివ్వంపేట(నర్సాపూర్) : పార్క్ చేసిన బైక్ దొంగతనానికి గురైన ఘటన మండల పరిధి దంతన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల రాములు శుక్రవారం సాయంత్రం హోండా బైక్‌పై పొలం వద్ద వెళ్లాడు. బైక్ పార్కింగ్ చేసి పంటను చూసి వచ్చే సరికి కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్లపై కేసు

రేగోడ్(మెదక్): పేకాట స్థావరంపై దాడి చేసి పలువురిపై కేసు నమోదు చేసిన ఘటన మండల కేంద్రమైన రేగోడ్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ పోచయ్య కథనం మేరకు.. మండలంలోని కొత్వాన్‌పల్లి రోడ్డు సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. పేకాట స్థావరంపై దాడి చేయగా ముగ్గురు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.1,600 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దొంగల బీభత్సం

\- ఇంట్లో 28 తులాల బంగారం, రూ.1.60 లక్షల నగదు అపహరణ

వట్‌పల్లి(అందోల్): గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడిన ఘటన అందోలు మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శేషారెడ్డి పటాన్‌చెరు సమీపంలోని ఇంద్రేశం వద్ద గల కళాశాలలో చదువుతున్న కూతురి ఆరోగ్యం బాగాలేదని చూడటానికి శుక్రవారం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. కూతురిని ఆస్పత్రిలో చికిత్స చేయించి, బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి 14న సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోపలికి వెళ్లి చూశాడు. దొంగలు బీరువా తెరచి అందులోని 28 తులాల బంగారం రూ.1.60 లక్షల నగదు, 16 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. వెంటనే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లు ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాండు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. బాధితుడు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన వ్యక్తి.. పొలంలో శవమై

చిన్నశంకరంపేట(మెదక్): అదృశ్యమైన వ్యక్తి గ్రామంలోని ఓ పంట పొలంలో మృతదేహమై కనిపించాడు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన తుడుం రాజు(35) శుక్రవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల్లో అంబాజీపేట వైపు నడుచుకుంటూ వెళ్లినట్లు గుర్తించారు. అటువైపు వెతుకుతుండగా పంటపొలంలో బోర్లా పడి మృతి చెందిన కనిపించాడు. భార్య మహేశ్వరి ఫిర్యాదు మేకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



జగన్నాథం మృతదేహం

చిలప్‌చెడ్(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ శివారులో గల చాముండేశ్వరి ఆలయ ఆవరణలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నర్సింలు కథనం మేరకు.. హైదరాబాద్ గుడి మల్కాపూర్‌కు చెందిన పతంగే జగన్నాథరావు(60) 12న ఇంటి నుంచి స్కూటీపై వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు టప్పాచబూతర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం చిట్కుల్ శివారులో గుర్తు తెలియని శవం లభ్యం కావడంతో చిలప్‌చెడ్ పోలీసులు, టప్పాచబూతర్ స్టేషన్ సిబ్బందికి విషయం తెలుపగా కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి వచ్చి జగన్నాథరావుగా గుర్తించారు. మృతుడి కుమారుడు సంతోష్ మాట్లాడుతూ.. మూడు నెలల కిందట జగన్నాథరావు భార్య వరలక్ష్మి మృతి చెందగా అస్థికలు మంజీరా నదిలో కలిపామన్నారు. భార్య మృతితో మనస్తాపం చెంది, అదే స్థలానికి వచ్చి విషం తాగి పొలంలో పడి మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మాపై కేసులు పెట్టడం సరికాదు

- వీరన్నపేట గ్రామస్తులు
- పాఠశాల స్థలం విషయంలో కోర్టుకు హాజరు



మాట్లాడుతున్న వీరన్నపేట గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): పాఠశాల స్థలం విషయమై మండల పరిధిలోని వీరన్నపేటకి చెందిన పలువురు చేర్యాల కోర్టుకు హాజరయ్యారు. శనివారం కోర్టు ఆవరణలో వారు మాట్లాడుతూ.. 20 ఏళ్ల కిందట పాఠశాల భవనం నిర్మాణం కోసం గ్రామానికి చెందిన తరిగొప్పుల ఐలుమల్లు, బాలమ్మ దంపతుల నుంచి కుల సంఘాల ఆధ్వర్యంలో చందాలు వసూలు చేసి 2 ఎకరాల 5 గుంటల భూమి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ స్థలంలోనే పాఠశాల భవన నిర్మాణం, క్రీడా ప్రాంగణం, మూత్రశాలల నిర్మాణంతోపాటు పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో 1 ఎకరం 26 గుంటల భూమి పాఠశాల పేరిట ఉండగా మిగిలిన 19 గుంటల భూమి అమ్మిన వారి పేరు మీదనే వస్తుందన్నారు. తమ పేరిట ఉన్న భూమి కోసం భార్యాభర్తలు ఇద్దరూ మా ఐదుగురిపై కోర్టులో కేసు వేశారని పేర్కొన్నారు. పాఠశాల భూమితో మాకు ఎలాంటి సంబంధం లేదని, అది కేవలం పాఠశాల భవన నిర్మాణం కోసం కొనుగోలు చేసిందన్నారు. కోర్టుకు హాజరైన వారిలో మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి, మాజీ ఎంపీటీసీ ఆరెళ్ల పాపయ్య, కొండాపురం మధు, పైస లింగం, సూర్న బీరుమల్లు ఉన్నారు.

మ్యాట్రిమోనీ పేరుతో అమ్మాయిని మోసం చేసి

- పెళ్లి చేసుకుంటానని రూ.5.50 లక్షలు తీసుకున్న వైనం
- పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడితో పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): మ్యాట్రిమోనీ పేరు చెప్పి అమ్మాయిలతో పరిచయం పెంచుకొని డబ్బులు తీసుకొని మోసం చేస్తున్న నిందితుడిని చేర్యాల పోలీసులు అరెస్టు చేశారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో సీఐ శ్రీను కేసు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా బేతంచెర్లకు చెందిన గుమ్మనా వివేకానంద రెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక అమ్మాయికి మ్యాట్రిమోనీ పేరుతో లింకు పంపించాడు. లింక్ ఓపెన్ చేసి అతడితో మాట్లాడిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తర్వాత అత్యవసరంగా డబ్బులు అవసరమున్నాయని, త్వరలోనే తిరిగిస్తానని చెప్పి విడతల వారీగా రూ.5,50,000 తీసుకున్నాడు. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. అనుమానం వచ్చిన అమ్మాయి పెళ్లి పేరుతో మోసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.